# సుగ్రీవాజ్ఞ


## సి.వి.నానారాజు లీలావతి


సుగ్రీవయ్యకు మనసు మనసులో లేదు. ముప్పై సంవత్సరాల సంసార జీవితం తర్వాత తన భార్య ఇలా చేయటం! తను ఈరోజు చూడకుండా చనిపోయినా బాగుండేది!

తను ఎలా బ్రతికాడు? ఊరికి మకుటం లేని మహారాజులా! ధర్మరాజులా! అలాంటిది తన భార్యే ఇలా చేసిం దంటే త నేం కావాలి? నలుగుర్లో తలెత్తుకుని తిరగగలడా! నలుగురి సంగతీ అలా ఉంచి, తను ఇంతవరకూ బతికిన బతుక్కి - ఈ రోజు జరిగిన దానికీ మధ్య వైపరీత్యం గుండెలో బాకు గుచ్చినట్లుగా మెదులుతూ ఉంటే, తన భార్య ఈ సంఘటన తర్వాత కూడా ఈ రోజూ, ప్రతి రోజూ తన ముందటే కదులుతూ ఉంటే తాను చూస్తూ ఊరుకోవలసిందేనా! ఊరుకోగలడా? ఊరుకోకుండా చేసే దేముంది? ఊరుకుని బతగ్గలడా! కనుక చావే శరణ్యమా! ఛ! త నెంత లోకు వైపోయాడు. తన ప్రాణం తనే తీసుకుని జీవితంలో ఓడిపోయినట్లు ఒప్పుకొని తొలగిపోవటమా, ప్రాణాలతో ఉండి జీవితంతో సరిపెట్టుకోవడమా? తను ఆత్మహత్య చేసుకోవట మంటే తన భార్య వల్ల తనకు జరిగిన అవమానాన్ని భరించటమే. బ్రతికి ఉంటే ఆ పరాభవాన్ని భరించట మవుతుంది. త నేం చేయాలి? తను బ్రతికి ఉండాలి, తన భార్య వల్ల తనకు కలిగిన శృంగభంగాన్ని సరిచేయాలి. కాని అది అసాధ్యం. జరిగిపోయిన దాన్ని తను జరగకుండా చేయలేడు. జరిగిన అవమానాన్ని పోగొట్టుకోలేడు. భార్య మీద పగ తీర్చుకుందా మంటే - పగ తీర్చుకోవా లనుకోవటం, అవమానం జరిగిం దనడానికి సాక్ష్యాధారపు ముద్ర. ప్రతీకారానికి దారితీసే ఎత్తులూ, పై ఎత్తులూ, ప్రతీకారమూ జరిగిన అవమానాన్ని క్షణక్షణానికీ పెంచి పేడకుప్పను మేరు పర్వతంలా చేసి, మనసును చంపి, మనసు స్థానే తామే నిలిచి, నిండి తామే వ్యక్తిత్వంగా విర్రవీగుతూ వ్యక్తిని న్యూనతా భావానికి బానిసని చేసి చచ్చేవరకూ వదలవు. తన భార్య మీద ప్రతిహతంగా తిరిగి ఆమెను అవమానించినా తనకు జరిగిన అవమానం పోదు. అలా ఆమె మీద ఎదురుదెబ్బ తీయా లనుకోవడమే తాను ఆమె చేతిలో దెబ్బతిన్నట్లు ఒప్పుకోవడం. తొలి దెబ్బతీసి నావిడ తాను ఎదురుదెబ్బ తీస్తే మలి దెబ్బ తీయకుండా ఉంటుందా! ఇంత బ్రతుకూ బ్రతికీ ఈనాడు తన భార్య తనను అవమానిస్తే తిరిగి తా నేదో చేయా లనుకుని మళ్ళీ మళ్ళీ అవమానింపబడుతూ లోకుల దృష్టిలో జీవచ్ఛవంలా బ్రతుకుతూ బ్రతుకు వెళ్ళదీయడమా! ఛీ! మళ్ళీ ఇదే ప్రశ్న ఎదు రవుతున్నదే ఇంతసేపటి తర్జనభర్జనల తర్వాత. అంతర్మధనం తదుపరి? మధనం జరిగినప్పుడు ఆ కాలంలో హాలాహలం ముందు పుట్టినా, తర్వాత అమృతం పుట్టింది. కాని తన మనోమధనంలో హాలాహలమే తప్ప అమృతపు చుక్క జాడ కూడా లేదు. ఇంతవరకూ అమృతభాండంలా సాగిన తన జీవితంలో విషపు చుక్కలాంటి ఈనాటి సంఘటనతో తన జీవితం ఇంతకాలం ఒక హాసంగా సాగింది ఇకపై పరిహాసంగా పరిణమిస్తుందా? పరిణమించిందా? తను సింహావలోకనం చేసుకుంటే తన జీవితంలో ఎన్ని అమృత ఘడియలు, ఆనంద శంఖారావాలు, సుందర స్వప్నాలు, విజయ గీతికలు!

తన చిన్నచాటి ఆ రోజు తనకు ఇప్పుడూ బాగా గుర్తే.

"సుగ్గూ! సుగ్గూ! నందిని వదుల్తున్నారట నాన్నా! ఈ సారి నువ్వే పట్టాలయ్యా!" అంటూ






వచ్చింది తన తల్లి సుగుణమ్మ.

అప్పటికి తనకు పంతొమ్మి దేళ్ళుండొచ్చు. తనూ తండ్రి, తాతల్లాగా చేయెత్తు మనిషే. తన తల్లి తరపునైతే అందరూ భేతాళ రూపులు. తన తల్లిదీ నిండైన విగ్రహం. తమది సునంపన్న రైతు కుటుంబం. పెరుగూ, నేతులూ, మాంసాలూ, భక్ష్యాలూ తన శరీరంలో కలిసిపోయి మెరుగు దెచ్చాయి. అప్పటికే తను చేతి కందొచ్చి పాలే ళ్ళందరినీ అజమాయిషీ చేస్తుంటే, నాన్న సావిట్లో పడక్కుర్చీలో కూర్చుని ఒక కన్నుతో తనను గమనిస్తూ, రెండో కంటితో తన కొడుకు ప్రయోజకత్వానికి నవ్వుకుంటుండేవాడు. ఆయనకి ఊరంతటికీ బలశాలిగా పే రుండేది. ఒక సంవత్సరం ఆయన నందిని పట్టాడట. ఆయన నందిని పట్టిన ఒడుపునూ, బలాన్నీ చూసి కళ్ళు తిరిగినంత పనైన తాతగారు ఆ తాలూకా కంతటికీ అందగత్తైన అమ్మను నాన్న కిచ్చి పెళ్ళి జరిపించి, అల్లుడిగా చేసుకునేంతవరకూ నిద్రపోలేదట. అందుకే అమ్మకు తన చిన్నప్పటి నుంచీ పట్టుదల - తన కొడుకు తండ్రిని మించిన కొడు కనిపించుకోవాలి. అలా తండ్రి కంటే ఎక్కువైన ఎక్కువతనం తన నుంచి వచ్చిందని తాను మురిసిపోవాలని అమ్మ కోరిక. మీసాలు ఇంకా వచ్చీ రాని వయసు తనది. నాన్నను చూసి దూరం నుంచి వినయంగా తల వంచాడు. లంగోటీ బిగించి రాములవారి గుడి దగ్గరకు వెళ్ళాడు.


నందిని ఆరుగురు అజానుబాహులు ముక్కుకూ, పొట్టకూ, నడుముకూ అటూ ఇటూ తాళ్ళు వేసి లాగి పడుతున్నారు. అయినా నంది ఆగటం లేదు. దాన్ని చిన్నప్పటి నుంచి మకురుపిల్లాడిలా పెంచి, మారాల కుంకగా తయారుచేసిన సింహాద్రినాయుడు అసలు ఆగటం లేదు. నందిని పట్టి నిలవడానికి ప్రయత్నం చేస్తున్న అతని ఆరుగురు కొడుకులు నంది ఊపులకు నిలవలేకపోతున్నారు. అన్నల పక్కన నుంచుని అన్నలతోపాటు చిందులేస్తున్నది పదమూడు సంవత్సరాల సావిత్రి. నల్ల లంగా మీద తెల్లటి ఓణీ వేసుకుని తెగ మెరిసిపోతున్నది.

నందిని చూడటం మాని నందినిని చూడటం మొదలుపెట్టాడు తను.

"వదుల్తున్నాం! పట్టే వాళ్ళు సిద్ధంగా ఉండండి!" అని అరిచారు ఆరుగురు అన్నదమ్ములూ నంది లాగుళ్ళకు అతలాకుతల, మవుతూ.

అంతే! నందిని వాళ్ళే వదిలారో, లేక నందే వాళ్ళ చేతుల్లోని తాళ్ళను లాగేసుకుందో తెలియదు కానీ కళ్ళు మూసి కళ్ళు తెరిచేలోగా ఆరుగురు అనహాయశూరులూ త లో పక్కా కిందపడ్డారు. మరుక్షణం నంది వేసిన రంకెకీ, ముందుకు వేసిన ఉరుకుకీ జనం కకావిక లయ్యారు.

నంది తల ఎడమవక్కకు వంచి ఎడమ కొమ్ము మహా వేగంగా విసిరింది. ఎటు విసిరిందో, ఎవర్ని విసిరిందో చూసిన తన గుండె లావా చిమ్మింది. తన కళ్ళముందే సావిత్రి కొమ్ము తాకిడికి గుడ్డబొమ్మలా లేచి అల్లంత దూరాన పడింది. నంది ముందు కాళ్ళ గిట్టలతో నేల గీరి, రంకె వేసి, తల బాగా కిందకు వంచి కింద పడిన సావిత్రిని కుమ్మటానికి గునుకు పరుగుతో ఉరకెయ్యబోతుంటే అప్పుడు తను స్పృహలోకి వచ్చాడు.



**ఆహారం**

"మీరు సాధారణంగా ఎటువంటి ఆహారం తీసుకుంటారు?" ఓ బాక్సింగ్ ఛాంపియన్‌ను ప్రశ్నించాడో విలేఖరి

"రాత్రిపూట మా ఆవిడ వండింది తింటాను. పగటి పూట మాత్రం ఓపికుంటే వండుకుంటాను."

వి.ఎస్.చంద్రన్ [నత్తెనపల్లి]

ఎగిరి ముందుకు దూకి రెండు చేతులతో నంది తోక పట్టుకుని వెనక్కి గుంజాడు. కుర్రతనంతో, నంది బలాన్ని తక్కువగా అంచనా వేశాడు తను. తన గుంజులాటకు నంది వెనక్కి రాలేదు కాని, నంది ఊపుకి తనే రెండడుగులు ముందుకు వెళ్ళాడు. అయితే నంది రెండు అడుగులు మాత్రమే ముందుకు వెళ్ళగలిగింది కాని, ఆగలేదు, అదే ఊపుతో కుడివైపుగా వెనక్కి తిరిగి తన తోక పట్టుకున్న సాహసిని మట్టి కరిపించటానికి కుడి కొమ్ము విసిరింది. తాను తోక వదలి పక్కకు దూకాడు.

నంది మరింత కోపంగా దిక్కుమార్చి తన పొట్టలో కుమ్మటానికి మెడ వంచి ముందుకు దూకింది. అప్పుడు తను నంది రెండు కొమ్ములూ రెండు చేతులతో బలంగా పట్టుకున్నాడు. తర్వాత నంది తలతో విసిరి కొట్టీ కొట్టీ చేతుల పట్టు విడిపించుకోవాలని చూసింది. చిందులూ, శివాలూ వేసి తనను తొక్కేయాలని తొక్కిసలాడింది. కాని తను కొమ్ముల పట్టు వదలలేదు. మనిషికీ, మృగానికీ మధ్య హోరాహోరీ పోరు. క్షణాలు నిముషాలుగా మారి నిమిషాలు గంటగా మారేసరికి జీవాలు రెండూ అలసిపోయాయి. శరీరాల ఆకారాలు వేరైనా శ్రమలు ఒకటే అయిన జీవులు కదా!

అలసిపోయి పడిపోయిన నందికి సేదదీర్చటానికి అన్నదమ్ములు ఆరుగురూ నంది చుట్టూ చేరితే, ఆ అన్నదమ్ముల తండ్రి సింహాద్రినాయుడు, చెల్లెలు సావిత్రి సుగ్రీవయ్య పక్కకు చేరారు.

సుగ్రీవయ్య తల్లి సింహాద్రినాయుడి చెల్లెలు. ప్రాణరక్షకుడని, ప్రేమించానని ఈ తరం ఫారిలా గంతులు వేయకుండానే సావిత్రి సాంప్రదాయంగా తండ్రి చెప్పినట్లు సుగ్రీవయ్యను పెళ్ళి చేసుకుని సంసారాని కొచ్చింది. ఆ విధంగా ఒక విధంగా తన భార్య సావిత్రి తన పరాక్రమానికి కానుకలాంటిదే. గత ముప్పై సంవత్సరాలుగా తనకు కానుక అంత అమూల్యమైనదిగానే ఉంది.

అటువంటిది ఈరోజు ఇంతకు దిగజారుతుందా, తనను దిగజారుస్తుందా!

ఇంకో రోజు కూడా తన గుండె లోతుల్లో పాదు చేసుకుని ఉంది. తమ పెళ్ళైన ఆ రేడు సంవత్సరాలకు మూడో కొడుకు పుట్టాడు. సావిత్రిని పెద్దానుపత్రిలో చేర్పించాడు. కానుపుకు ఆపరేషన్ జరిగింది. రక్తం చాలా పోయి సావిత్రి ప్రాణాపాయ స్థితికి చేరింది. అప్పుడు తానే స్వయంగా రక్తం ఇచ్చి భార్యను బ్రతికించుకున్నాడు. ఆ రోజు అర్ధరాత్రి సావిత్రి అపస్మారకంగా పడి ఉంది. తను రోజంతా ఆందోళనతో గడపటం వల్ల, రక్తం ఇచ్చినందున కలిగిన బలహీనత వల్ల మెలకువగా ఉండాలని భార్యకు, బిడ్డకు వైద్యపరమైన అవసరాలు చూస్తూ కూర్చోవాలని అనుకుంటూనే భార్య మంచం పక్కన స్టూలు మీద కూర్చుని తలను కొంచెం విశ్రాంతికి మంచం మీద ఆనించిన తనకు ఎప్పుడు పట్టిందో, ఎలా పట్టిందో నిద్రలోకి వెళ్ళిపోయి, చల్లటి చేయి నొసటిమీద రాస్తుంటే కళ్ళు తెరిచాడు.


సావిత్రి నీరసంగా మంచం మీద కూర్చుని తన

నొసటి మీద చేతితో రాస్తూ, "నువ్వు శానా మంచోడి వయ్యా!" అని గొణుగుతూ, మళ్ళీ వెనక్కి దిండు మీదకు వాలి కళ్ళు మూసుకుని పడుకుంది. ఆ ఒక్క మాటలో తన భార్య తనను తనకు అంకితం చేసుకున్న దన్నంత అర్థాన్ని తను చదువుకున్నాడు. మూడో మనిషికి తెలియని, తా మిద్దరికే తెలిసిన ఆ మాటను తన గుండె పెట్టె లోపల నగలాగా దాచుకున్నాడు. అయితే అ దంతా తన భ్రమేనా! తన భార్య తనకు అంకితం కాదా? కా దనే ఈరోజు సంఘటనతో తేలిపోయింది.

తా మిద్దరూ కన్న కలలు కూడా కల్లలు కాలేదు. కూడబలుక్కున్నట్టు అన్నీ కలసివచ్చాయి. పెద్ద కూతురుని నాలుగో బావమరిది కొడు క్కిచ్చి పెళ్ళి చేసి తమ కళ్ళ ముందే ఉన్న ఊళ్ళోనే ఉంచుకున్నారు. రెండో కొడుకుని డాక్టర్ చదివించి, ఇంకొక పెద్ద డాక్టరు గారి కూతురుని ఇచ్చి పెళ్ళి చేసి, పట్నంలో పెద్దాసుపత్రిలో డాక్టరుగా స్థిరపరిచారు. మూడోవాడు ఇంజనీరు. అసంతృప్తి కల అపరిపూర్ణమైన జీవితాలలోనే కుటుంబంలో పోట్లాటలు, ముఖ్యంగా ఆలుమగల మధ్య వైరా లుంటాయి, వైరాగ్యాలూ ఉంటాయి. మరి పరస్పరం లెక్కలేనితనమూ, విశృంఖల విహారమునూ. ఇంతవరకు పరిపూర్ణ మనుకున్న తన జీవితం అపరిపూర్ణమా, లేక తనది సంపూర్ణ జీవితమైనా, తనతో కలసి ఆ సంపూర్ణ జీవితంలో భాగస్వామిని, సహధర్మచారిణి అనుకున్న తన భార్యది కోరికలు తీరని అసంపూర్ణ జీవితమేమో! తన కోరికలతో మిళితమైపోయి తృప్తి పడ్డా యనుకున్న ఆమె కోరికలలో తన కోరికలతో మిళితం కాకుండా వేరుగా ఆవిడ గుండెలో దాచబడి ఈ రోజు బయటపడుతున్న వాటి ఫలితమా ఈ నాడు తన కళ్ళ ముందు జరిగింది.

ఈ విధంగా ఎప్పుడూ జరగలేదు! 'ఈ విధంగా జరగనివ్వను' అని అనుకోవాల్సిన అవసరం తనకు జీవితంలో ఎప్పుడూ కలగలేదు. వ్యతిరేక పరిస్థితి ఉన్నప్పుడే అలా అనుకోవాల్సి వస్తుంది. తనకు వ్యతిరేకత ఎప్పుడూ ఎదురవలేదు. వ్యతిరేకత సామాన్యంగా ఉండే రాజకీయాల్లో కూడా సర్వత్రా తనకు అనుకూలతే. ఏకగ్రీవంగా తను గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా ఇరవై సంవత్సరా లున్నాడు. తనే కావాలని ఈసారి తాను తప్పుకుని అల్లుడిని గ ద్దెక్కించాడు. గద్దెక్కినా, అల్లుడు తనకు చెప్పకుండా, తన అజ్ఞ లేకుండా ఏ పనీ చేయడు.

తను సుగ్రీవయ్య, తనది సుగ్రీవాజ్ఞ. నిజానికి తనది ఆజ్ఞ కాదు. తన జీవితంలో ఎప్పుడూ ఆజ్ఞ ఇవ్వలేదు. ఎవరి మీదా తన ఆజ్ఞను ఆపాదించాల్సిన అవసరం ఈనాటివరకూ కలగలేదు. తన ఆజ్ఞ ఏమిటో ఊ రందరికీ తెలును. తనది ధర్మపరిపాలన. నీతిగా, చట్టబద్ధంగా చేసే పని సుగ్రీవయ్యకు ఇష్టం. అధర్మాన్నీ అన్యాయాన్నీ సహించడు సుగ్రీవయ్య. ఇది అందరికీ తెలును. ఇక సుగ్రీవయ్యకు అజ్ఞాపించాల్సిన అవసర మెక్కడిది? ఊ రందరూ ముక్కుకు సూటిగా పోవటమే. అటువంటి సాఫీగా సాగిన తన జీవితంలో ఏమీ టీ కారుమబ్బు. ఇది తుపానుకు దారితీస్తుందా?




పడక్కుర్చీలో పడుకున్న సుగ్రీవయ్య కళ్ళలో నుంచి నీళ్ళు పై కుబికి బుగ్గల మీదుగా జారి బుగ్గ మీసాలను తడుపుతూ, గెడ్డం మీదకు వచ్చాయి.

"ఇదుగో, ఏంటీ, అన్న వేళైనా ఇంకా పడుకునే ఉన్నావు? కళ్ళల్లోంచి నీళ్ళు వస్తన్నా తెలియట్లేదా? ఒకసారి పెద్దోడి దగ్గరె కెల్లి కళ్ళు సూపిచ్చుకురా! అన్నం తిందుగాని రా! సల్లారిపోతంది" అని తన భార్య సావిత్రమ్మ కేకేసేసరికి ఉలిక్కిపడి లేచి కళ్ళు తుడుచుకుంటూ - "నాకు ఆకలేయటం లేదే!" అన్నాడు సుగ్రీవయ్య - ఒళ్ళు మండుతుంటే తనను తాను అతికష్టం మీద నిగ్రహించుకుంటూ.

"ఏంటయ్యా! నువ్వు సెయ్యమన్నా వని బీరకాయ కూర చేసేను. నీ కిట్టమని బీరకాయ పచ్చడి కూడా సేశా. వచ్చి రెండు మెతుకులు తిను. ఈ అన్నం తినకండా అలగటాలకి ఇది మనకి వయసా!" అని నవ్వింది సావిత్రమ్మ.

ఇంత క్రితం భార్య బీరకాయ పచ్చడి చేస్తుంటే చూశాడు సుగ్రీవయ్య.

భార్యను బీరకాయ కూర వండమంటే పచ్చడి చేస్తున్న దేమిటీ? తన జీవితంలో భార్య మొదటిసారిగా తిరుగుబాటు చేస్తున్నదా, తనంటే లెక్కలేనితనం చూపిస్తున్నదా. ఇంతవరకూ జీవితంలో ఓటమి నెరుగని తను తన జీవిత భాగస్వామిని చేతిలోనే ఇకముందు ప్రతిరోజూ అవమానాలను భవించాలా? దీనికంటే గౌరవంగా పై చేయి ఉంచుకుంటూనే చచ్చిపోవటం ఉత్తమమా! తిరస్కారం ఇప్పటికే జరిగిపోయింది కనుక ఆ ఉత్తమంగా చనిపోవటం అనుకున్నది కూడా ఓడిపోయి చనిపోవట మవుతుందే. బ్రతికుంటే ఓటమిని అంగీకరించి నట్లవుతుందే. అలా అని పచ్చడి చేయొద్దు, కూర వండమంటే తన మాట భార్య వినలేదని తెలిసీ, వినమని ప్రాధేయపడినట్లో, లేక పోరాడినట్లో అవుతుంది తప్ప అందులోనూ విజయం మృగ్యమే. ఇది చాలా చిన్న విషయంగా పైకి ఉన్నా దీనిలో సుగ్రీవయ్య జీవిత మంతా పెంచి పరిపుష్టం చేసుకున్న వ్యక్తిత్వపు అహం కేంద్రబిందువు కూరా, పచ్చడా అనే రెండు చాలా చిన్న విషయాల మధ్య తాను బంధింపబడుతూ, ఆయన వ్యక్తిత్వాన్ని తనతోపాటు విషచక్రంలో బిగించేసింది. అందుకే అన్ని ఆలోచనలు. శ్రుతులు, అపశ్రుతుల తరంగ నాట్యాలు. తన జీవిత సారమంతా బూడిదలో పోసిన పన్నీరైం దన్నంత బాధ. స్వచ్ఛమైన పాల నురగలాంటి తన జీవితంలో కాసింత మరక కనబడినట్లయితే కొసెక్కిపోయిన పరిపూర్ణ వ్యక్తిత్వపు క్షోభ. మాట కోసం, మాట గీసిన గీటు కోసం తన చుట్టూ మహోన్నత మానవత్వం విలువల గిరి గీసుకున్న విలువైన మనిషి తను. అమూల్యంగా చూసుకునే మమ తానుబంధానికి చిన్న చిరువెచ్చటి గాలి సోకిం దనేసరికి పడే మహా తపన. మృత్యు సదృశమైన మహాబాధ. మరణాతీత, జన్మాతీత శక్తి ఏదో తనను గుప్పిట్లో పట్టి తనను, తన జీవితాన్ని పిండివేస్తూ తాను తన జీవితంలో ఉం దనుకుంటున్న తీపి నంతటినీ తేనె పిండినట్లు చుక్కచుక్కగా పిండుతూ, తన జీవితంలోని మధుర స్మృతులు అనుకున్న వా టన్నింటినీ తేనె పిండేసిన ఖాళీ తేనె పట్టు గదుల్లాగా చేసి, తన జీవితాన్ని ఖాళీగా, చేదుగా మిగులుస్తున్న మిగిల్చిన అంతరాంతర భావం.

భార్య మాటలతో జీవం పోసుకుంది బిక్కమొహం వేసిన సుగ్రీవయ్య ముఖం. తను చెప్పినట్లు తన భార్య బీరకాయ కూర చేసింది. తన కిష్టమని పచ్చడీ చేసింది. తను సుగ్రీవయ్య! తనది సుగ్రీవాజ్ఞ!

"అన్నం వడ్డించే! వస్తున్నా!" అంటూ పడక్కుర్చీలోంచి పైకి లేచాడు దుఃఖాశ్రువులు ఆనందాశ్రువులుగా మారుతుండగా. అంతర్లీనంగా తను మానవత్వ విలువ లనుకుంటున్న వాటి మాటున దాక్కుని ఉన్న పురుషాహంకారం తృప్తిపడగా.

తన భర్త పురుషాహంకా రాంతరంగానికి అతీతంగా పూర్తి వ్యతిరేకమైన సౌమ్యంతో అమాయకంగా, ఆప్యాయంగా భర్తకు అన్నం వడ్డించడానికి లోపలికి నడిచింది సావిత్రమ్మ అనే ఆ భార్య ●